Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# తెలుగు మాధ్యమంలో చదువు సాగనిస్తారా?-3



**నూర్ బాషా రహంతుల్లా**
స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ
కలక్టర్ అమరావతి
6301493266

(ఆదివారం సంచిక తరువాయి)

ఇవి ఖచ్చితంగా అమలు చేస్తే తెలుగు వ్యతిరేకులు దారికొస్తారు, తెలుగు వ్యతిరేక వాతావరణం తగ్గుతుంది.

తెలుగు మాధ్యమ అభ్యర్థులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు డిగ్రీ తెలుగు మాధ్యమం లో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఆనాటి మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, భూమా అఖిలప్రియ వాగ్దానం చేశారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య ఇంగ్లీషు మీడియంలోనే ప్రవేశపెడతామన్నారు. ఇంగ్లీషు మీడియం లేకపోవటం వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతున్నాయనీ, విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నదనీ ఉభయ రాష్ట్రాల్లో చర్చ నడుస్తున్నది. మునిసిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం రద్దుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మరోవైపు రాష్ట్ర మంత్రి నారాయణ తెలుగు మాధ్యమంలో చదువుకుంటే ఉద్యోగాలు రావని, ఇంగ్లీషు మాధ్యమంలోనే ఉద్యోగాలొస్తాయని, మున్సిపల్ పాఠశాలలన్నింటిలో తెలుగు మాధ్యమం తీసేసి ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశ పెడతామని ప్రకటించారు. ఎవరి మాటలు నమ్మాలి? ప్రాథమిక స్థాయిలోనే మాతృభాషను నేర్చుకొనే అవకాశం కోల్పోయి మరోసారి స్వాతంత్ర్యాన్ని కోల్పోయాము. గత్యంతరంలేక పరాయి భాష లోకి తప్పనిసరై కావాలనే మన పిల్లల్ని నెడుతున్నాము. తెలుగులోనే పరీక్షలు రాసి, ఆ భాషలోనే ముఖాముఖిలో పాల్గొని, కేంద్ర ప్రభుత్వ అధికారులుగా ఎంపికైన వారు ఎంతమంది లేరు? అలా మాతృభాష ద్వారా ఉద్యోగాలను సాధించే స్థాయికి మన పిల్లలను తీసుకెళ్ళాలని మన నాయకులు కూడా కోరుకోవాలి కదా? సర్వీస్ కమీషన్ ఉద్యోగాలలో తెలుగు మాధ్యమం ద్వారా డిగ్రీలు చేసిన వారికి ఎన్ని దక్కుతాయి? ప్రజల భాషకు పరిపాలనలో పట్టం కడతామనే నాయకుల వాగ్దానాలు రెండు రాష్ట్రాల్లోనూ వినబడుతున్నాయి. తెలుగును ఉపాధి వనరుగా మార్చాలని అందరూ కోరుతున్నారు. కొందరైతే ప్రజల భాష పదికాలాలపాటు పాలించాలని తపిస్తున్నారు కూడా. తెలుగు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు పొందేలా చెయ్యాలి మన ప్రజా సేవ (పబ్లిక్ సర్వీస్) కమీషన్లు. 1985 వరకు పబ్లిక్ సర్వీస్ కమీషన్ పోటీ పరీక్షల్లో తెలుగు మీడియం డిగ్రీ విద్యార్థులకు ఇచ్చిన 5 శాతం ప్రోత్సాహక మార్కులు హై కోర్టు తీర్పుతో ఆగిపోయాయి. ప్రభుత్వం హై కోర్టులో అప్పీల్ చేసి మార్కుల పునరుద్ధరణకు ప్రయత్నించాలి. గ్రూప్ 1, గ్రూప్ 2 సర్వీసు ఉద్యోగాలలో డిగ్రీ తెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5% ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. తెలుగులో కార్యాలయ వ్యవహారాలు నడిపే అభ్యర్థులకు దారివ్వాలి. ఆఫీసుల్లో తెలుగు బతకాలి. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగాలు రావాలి. మన పిల్లలు తెలుగులో చదవాలి. తెలుగు అధికారులు తెలుగులో కార్యాలయాలు నడపాలి. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థుల్ని ప్రోత్సహించి అధికారులుగా చేయాలి.అప్పుడు జనం తండోపతండాలుగా తెలుగులో చదువుతారు. తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు సర్వీసు కమీషను పరీక్షల్లో రిజర్వేషన్లు , ప్రోత్సాహక మార్కులు తిరిగి ఇప్పించటానికి కృషి చేస్తామని 2012 ప్రపంచ తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీపై జీవోలు ఇవ్వాలి.

## తెలుగు భాషలో సాధికారత ఏదీ?

ఎవరి భాషలో వారికి విద్యను బోధిస్తేనే ప్రయోజనమన్నారు గిడుగు రామమూర్తి. బడి పలుకుల భాష కంటే పలుకుబడుల భాషే అవసరమని కాళోజీ చెప్పారు.అసలైన పురోగతి మాతృభాషతోనే సాధ్యమని గాంధీజీ వాదించారు. అమ్మ భాషలో బోధన విద్యార్థి సృజనను ఎంతో పెంచుతుందని విశ్వకవి రవీంద్రుడు భావించాడు. ఇవేవీ పట్టించుకోకుండా ఇంగ్లీషులో మాత్రమే నేర్పుతున్న చదువు పిల్లలకు భారంగా మారింది. కళాశాల విద్య అర్థం కావటం లేదు. పనిమీద ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారికి అక్కడ ఏమి జరుగుతుందో తెలియటం లేదు. న్యాయస్థానాల్లో ఎవరు ఏం మాట్లాడుతున్నారో, అక్కడ జరుగుతున్న ప్రక్రియ కక్షిదారులకు అంతుపట్టడం లేదు. ఇటు సొంత తెలుగు భాష చెల్లక, అటు పరాయి కోర్టు భాష సొంతం తెలియక, ఎంతకీ అవగతం కాక అవస్థ పడుతున్నారు. సొంత భాషలో చెప్పుకోలేను, పరభాషలో నవ్వలేను, ఏడ్వలేను' అన్నట్లు మారింది పరిస్థితి. అర్థమైనా కాకపోయినా ప్రతి విషయం ఇంగ్లీషులోనే చెప్పుకోవాల్సి వస్తోంది. మాతృభాషలో స్వేచ్ఛగా మాట్లాడే భాగ్యాన్ని పోగొట్టుకున్నాం. సొంత మాటలను, పదసంపదను పోగొట్టుకొని మూగవాళ్ళలాగా బతుకుతున్నాం. భాషా దారిద్ర్యం, భావ దారిద్ర్యం రెండూ మన ప్రజల్ని బాధించేలా మన పాలన, విద్యా, న్యాయ రంగాలను తయారు చేశారు. భాషా ప్రయోజనాల్ని అందరి దరికీ చేర్చే బాధ్యత ప్రభుత్వానిది. తెలుగునాట తెలుగు భాషా బోధనను నిర్బంధం చేయాలి. ప్రాథమిక దశ నుంచి ఉన్నత పాఠశాల చదువు ముగిసే పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలోనే బోధించాలి. పాఠ్యపుస్తకాల్ని పిల్లలందరికీ బాగా అర్థమయ్యేలా రూపొందించాలి. కన్నడ భాషాబోధనను అక్కడి ప్రభుత్వం ఉన్నత పాఠశాల దాకా నిర్బంధం చేసింది. కర్ణాటకలో పనిచేసేవారికి ఆ భాష తప్పనిసరిగా తెలిసి ఉండాలని తేల్చిచెప్పింది. తమిళనాడులో మాతృభాషలో చదివితేనే అక్కడ ఉద్యోగాలిస్తారు, మలయాళ భాష, సంస్కృతిని పదిలపరచుకొనేందుకు అక్కడ ప్రత్యేకంగా ప్రాధికార సంస్థ ఏర్పాటైంది. ఒడిశా, గుజరాత్, పశ్చిమ్ బంగ, మహారాష్ట్రల్లోనూ చదువుల్లో, ఉద్యోగాల్లో అక్కడి మాతృభాషలకే పెద్దపీట వేస్తున్నారు. ఆంగ్లంలోని గ్రంథాల్ని ఇజ్రాయెల్ తన భాషలోకి కొద్దికాలంలోనే తర్జుమా చేసుకొంది. అత్యాధునిక పరిజ్ఞానానికి సంబంధించిన ఏ పదమైనా వెంటనే స్వీడన్ భాషలోకి అనువాదమవుతోంది

## ఉన్నత న్యాయ స్థానాలలో తెలుగు కనీసం ప్రవేశిస్తుందా?

మన పాఠాల్లో ఉన్న తెలుగు ఎంత? ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో తెలుగు మాయమవుతోంది! మార్కులకు పనికిరాని సబ్జెక్టుగా మిగిలిపోతోంది. తమిళనాడులో సెంట్రల్ సిలబ్‌సలోనూ తొమ్మిదో తరగతి వరకు తమిళం తప్పనిసరిగా బోధించాల్సిందే. తెలంగాణలో పాఠశాల నుంచి జూనియర్ కళాశాల వరకు ఒక బోధనాంశంగా తెలుగు ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. తెలుగును బోధించే విద్యాలయాలకు మాత్రమే తెలంగాణలో అనుమతి దక్కుతుందన్నాడు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నామఫలకాలపై తెలుగు విధిగా కనిపించాలన్నాడు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఏమిటి పరిస్థితి?

హైకోర్టులో తెలుగు వాదన పనికిరాదు పొమ్మన్నాడో ప్రభుత్వ న్యాయవాది. 1952 లో తెలుగు భాష పేరుతో మన రాష్ట్రం ఏర్పడింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలలో మనదే మొదటి రాష్ట్రం. భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు ఉద్దేశం ఏమిటి? తెలుగు రాష్ట్రాన్ని తెలుగులోనే పరిపాలించటం. గత 66 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో తెలుగు పాలన సిద్ధించిందా? ఏమి ఆశించి భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేశారో ఆ ఉద్దేశాలు ఈనాటికీ నెరవేరకపోగా భవిష్యత్తులో కూడా ప్రజల భాషలో పాలన నడుస్తుందనే ఆశలు కూడా వదులుకోవాలనే హెచ్చరికలు వస్తున్నాయి. అసలు పాలించటానికి మీ భాష బతికి ఉంటుందా అనే సవాళ్ళు నిత్యమూ ఎదురవుతున్నాయి. తెలుగు జనమే ఇంగ్లీషు కాన్వెంట్లకు ఎగబడుతుంటే తెలుగు బడులు నిలుస్తాయా తెలుగులో ఫైళ్ళు నడుస్తాయా అని పరిహాసాలు ఆడుతున్నారు. తెలుగు జాతి మనది- నిండుగ వెలుగు జాతి అనే పాటను తెలుగు జాతి మనది- రెండుగ వెలుగు జాతి అని పాడుకుంటున్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు, దిగువ కోర్టుల్లో న్యాయపాలన అంతా మాతృభాషలోనే సాగేందుకు వీలుగా రెండు హైకోర్టులూ సాయపడాలని వేడుకుంటున్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్లు అన్ని కోర్టుల్లో కూడా ఆంగ్లానికే ఆదరణ దొరుకుతోంది.ఎన్నో అవాంతరాలున్నా తెలుగులో తీర్పులు ఇచ్చి కొందరు న్యాయమూర్తులు సాహసోపేతమైన శ్రమ చేశారు.

## తెలుగు జాతీయ భాష కావాలి

జాతీయ భాష కాగల అర్హత తెలుగుకే ఉందన్నాడు జేబీ హాల్డెన్ .నిజమేననుకొని సంబరపడ్డాం. కానీ ప్రాంతీయభాషగా కూడా నిలదొక్కుకోలేక ఈనాడు తెలుగు తల్లడిల్లుతోంది.ఉపాధి కోసం జనం కూడా ఆంగ్లం మోజులో పడి కొట్టుకుపోతున్నారు. తెలుగు సొంతగడ్డపైనే మనుగడ కోల్పోతున్నది. పిల్లల మానసిక ఎదుగుదలకు మాతృభాష ఎంతో కీలకం.పాఠశాలల్లో పదవ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమంలోనే బోధన సాగాలి. ప్రతి బడీ అమ్మ భాషకు గుడి అయినప్పుడే పిల్లలకు సొంత భాష వస్తుంది. మాతృభాషలోనే అన్నివిషయాలూ నేర్చుకున్న పిల్లలే తమ సొంత భాషలో పాలన చేయగలుగుతారు.

ప్రపంచవ్యాప్తంగా అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషల్లో తెలుగుది ఆరోస్థానం.మన ప్రజల నాలుకలపై అది నిత్యం నడయాడాలంటే ,మన పిల్లలు తెలుగు నేర్చుకోవాలి. మాతఎభాష కళ్ళు అయితే, పరాయిభాష కళ్లజోడు అన్నాడు అన్నాదురై. తమిళం,మరాఠీ, కన్నడ బోధనలను తప్పనిసరి చేస్తూ అక్కడ గట్టి చట్టాలు చేశారు. అధికార భాషా సంఘం ఏర్పాటయ్యింది.తెలుగు రాష్ట్రం అన్న పేరేగాని చట్టసభల్లో, పాలన వ్యవహారాల్లో, పాఠశాలల్లో,తెలుగు అమలు లేదు. ప్రభుత్వ పాలన కూడా తెలుగులో జరగాలని పాలకులు ఆశిస్తున్నారో లేక ఆశిస్తున్నట్లు నటిస్తున్నారో అని అనుమానం కలుగుతోంది.కాబట్టి శాసన నిర్మాణ క్రతువులో, పాలన వ్యవహారాల్లో తెలుగును తప్పనిసరి చేయాలి.రాష్టపతి కోవింద్ కోరినట్లు కక్షిదారుల భాషలోనే హైకోర్టు తీర్పులుండాలి . (మిగతా రేపు)

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org